సాక్షి చిత్తూరు

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



జీవో రద్దుకు వినతి

జీవో నంబర్ 85ను రద్దు చేయాలని కోరుతూ వైద్యాధికారులు డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవికి వినతి పత్రం ఇచ్చారు. - 8లో



చిలుకపై గణపయ్య చిద్విలాసం

కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరసిద్ధి వినాయక స్వామి గురువారం చిలుక, వృషభ వాహనాలపై ఊరేగారు. - 8లో



ఘాట్‌లో మృత్యుఘోష

భాకరాపేట ఘాట్‌లో భారీ కంటెయినర్ కారుపై పడడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. - 8లో

న్యూస్‌రీల్

వీఆర్‌ఓల బదిలీల కౌన్సెలింగ్



మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఓ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 66 మండలాలకు చెందిన గ్రామ, వార్డు సచివాలయాల వీఆర్‌ఓలు విచ్చేశారు. డీఆర్‌ఓ పుల్లయ్య ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ బదిలీలకు 107 మంది దరఖాస్తు చేసుకోగా 99 మంది హాజరైనట్లు వెల్లడించారు. 8 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వీఆర్‌ఓల నుంచి ఆప్షన్లను సేకరించినట్లు చెప్పారు. త్వరలో ఆప్షన్లు ఇచ్చిన వారికి ఉత్తర్వులు జారీచేస్తామని డీఆర్‌ఓ వెల్లడించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నడుం: మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ డీపీఈ విభాగం ఎస్‌ఈ శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో సర్వీసులను తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 6 కేసులకు రూ.లక్ష, అధికంగా లోడ్ వినియోగిస్తున్న 8 మందికి రూ.50 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఈఈలు పూర్ణచంద్రకుమార్, నరేంద్ర, ఏఈ ఖాదర్ ఇలాహీ పాల్గొన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మాజీ సైనికుల పిల్లలకు ఉపకారవేతనాలను అందించనున్నారు. కేంద్రీయ సైనిక్ బోర్డు, రక్షణశాఖ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సులు చేస్తున్న మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలను మంజూరు చేయనున్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో చదువుతున్న మాజీ సైనికుల పిల్లలు ప్రధానమంత్రి ఉపకార వేతన పథకంలో www.krb.gov.in వెబ్‌సైట్‌లో నవంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్ మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,668 మంది స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఎస్ఎస్‌డీ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైద్య విద్యకు చంద్ర గ్రహణం





ఆరోగ్యవరం సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య వ్యవస్థకు ప్రాణం పోసింది. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, కార్పొరేట్ తరహాలో పేదలకు వైద్య సేవలు అందాలన్నే లక్ష్యం పనిచేసింది. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణానికి నాంది పలికింది. మెడికల్ సీట్లను పెంచుతూ, స్పెషాలిటీ వైద్య సేవలను అందించవచ్చనే సంకల్పంతో అడుగులు వేసింది. ఆ లక్ష్యాన్ని టీడీపీ ప్రభుత్వం నీరుగార్చేస్తోంది. కొత్త మెడికల్ కాలేజీలకు పొగ పెడుతోంది. నీట్ విద్యార్థులకు సీటు దొరక్కకుండా అవస్థల పాల్జేస్తోంది. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థకు తాకట్టు పెట్టేందుకు కంకణం కట్టుకుంది. దీంతో మెడికల్ సీట్లల్లో కోతలు పెడుతూ నీట్ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

- నూతన మెడికల్ కళాశాలలకు పొగ
- సీట్ల కుదింపునకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర
- నీట్ విద్యార్థుల ఆశలపై నీళ్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 2 వేల మందికిపై నీట్ రాస్తుంటారు. ఇందులో 1200 మందికి పైనే క్వాలిఫై అవుతుంటారు. జిల్లాలో రెండు మెడికల్ కాలేజీలుంటే, అందులో ప్రభుత్వ, ప్రైవేటు సీటు కింద 300 మందికి అవకాశం ఉంటుంది. ఈ సీట్లలో 50 శాతం వరకు ప్రభుత్వ కోటా కింద కేటాయిస్తారు. మరో 50 శాతం సీట్లు బీ, సీ కేటగిరీ కింద భర్తీ చేసుకుంటారు. ఇందులో ప్రభుత్వ కోటా కింద సీటు వస్తే, ఏడాదికి రూ.30వేల వరకు ఫీజు చెల్లించాలి. అలాగే బీ కేటగిరీ కింద ఏడాదికి రూ.11 లక్షలు, సీ కేటగిరీ కింద ఏడాదికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఫీజు ఉంటుంది. ఇక విదేశాలకు వెళితే కళాశాల ఫీజుతో పాటు ఇతరత్రా ఫీజులు, ఖర్చులు కలిపి రూ.25లక్షలకుపైగా ఖర్చువుతున్నట్లు వైద్య విద్యార్థులు చెబుతున్నారు. ఈ కారణంగా గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున వైద్యకళాశాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రాష్ట్రంలో 17 కళాశాలల నిర్మాణానికి పూనుకుంది. ఈ నిర్మాణం పూర్తయి ఉంటే జిల్లా నుంచి 100 నుంచి 200 మంది వరకు వైద్య విద్య పూర్తి చేసే అవకాశం దక్కేది. టీడీపీ ప్రభుత్వ నిర్ణయంతో ఈ సీట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం

చాలా మంది తల్లిదండ్రులు తమ బిడ్డలు డాక్టర్లు కావాలని కోరుకుంటుంటారు. ఇందులో ధనిక కుటుంబాలతోపాటు పేద, మధ్య తరగతి కుటుంబాలు కూడా ఉన్నాయి. చేతిలో డబ్బులు లేకపోయినా ఎడ్యుకేషన్ లోన్లు, పర్సనల్ లోన్లు, గోల్డ్ లోన్లు, భూ పత్రాలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని వైద్యవిద్య కోసం వెచ్చిస్తుంటారు. ప్రభుత్వ కోటాలో సీటు రాని పక్షంలో మేనేజ్‌మెంట్ కోటా కింద కూడా పిల్లలను వైద్య విద్య కోర్సులకు పంపుతున్నారు. రాష్ట్రంలో సీటు దొరక్కకపోతే పక్క రాష్ట్రాల వైపు చూస్తుంటారు. అక్కడ కూడా రాని పక్షంలో చైనా, ఫిలిప్పైన్స్‌కు వెళుతుంటారు. ఇలాంటి కష్టాలు పడుతున్న చాలా మంది విద్యార్థులు కంటిపై రెప్ప వేయకుండా నీట్‌లో ర్యాంకు కొట్టాలనే పట్టుదలతో కసిగా చదివేస్తుంటారు. అలా చదివి ఒక్క మార్కుతో సీటు రాకుండా పోతే, ఆ వేదన వర్ణనాతీతం. ఆ ఒక్క సీటుకే అంతా బాధఉంటే, వందల కొద్దీ సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ మెడిసిన్ చదవాలనే కోరిక ఉన్న విద్యార్థులకు కన్నీళ్లు తెప్పిస్తోందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్యం... గాల్లోనే

వైద్యుల సంఖ్యను పెంచడంతో పాటు పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావించింది. వైద్యకళాశాలలు ఏర్పాటైతే మరింత మంది డాక్టర్లు, సిబ్బందిని తయారు చేయవచ్చని ఆలోచించింది. ఆ మేరకు కార్యాచరణ చేపట్టి, కొత్త మెడికల్ కళాశాలలను తీసుకొచ్చింది. టీచింగ్ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సులభంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని భావించింది. అయితే ఆ ఆశయంపై టీడీపీ ప్రభుత్వం కత్తి పెట్టింది. టీచింగ్ ఆస్పత్రుల నిర్మాణపనులు నిలుపుదల చేయించింది. నిర్వహణ భారమని సాకు చెబుతూ..ప్రైవేటుకు అమ్మేసింది. ఇలా చేస్తే..సీట్లకు భారీగా ఫీజులు చెల్లించాల్సి వస్తోందని నీట్ విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇక సీట్లు దొరకడం కూడా కష్టతరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వలస విదేశీయానం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు సైతం పాదర్శకమైన వైద్యం దక్కదని అంటున్నారు.

మదనపల్లెలో 70 శాతం పనులు పూర్తి

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి పేదలకు వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. మదనపల్లె మండలం ఆరోగ్యవరం సమీపంలో 95 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్లతో నిర్మాణ పనులను ప్రారంభించారు. దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. మదనపల్లె మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తే చిత్తూరు, తిరుపతి జిల్లా విద్యార్థులకు కూడా అందుబాటులో మరో ప్రభుత్వ వైద్యశాల అందుబాటులోకి వచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రయివేటుపరం చేయాలన్న నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు సాధించకుండా పొగబెట్టింది.

ఇది సరికాదు



ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లపై వివక్ష చూపించడం సరైన విధానం కాదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో సీట్లు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. అయితే ప్రస్తుతం ఆ కళాశాలల్లో సీట్లు రద్దు చేస్తారని చెబుతుంటే భయంగా ఉంది. నా చిన్నతనం నుంచి డాక్టర్ అవ్వాలన్నది కోరిక. అదే విధంగానే కష్టపడి చదువుతూ వస్తున్నాను. పేద, మధ్య తరగతికి చెందిన నాలాంటి విద్యార్థులకు అన్యాయం జరిగే విధంగా సీట్లు రద్దు చేయడం సరైన విధానం కాదు.

– యాసిని, నీట్ విద్యార్థిని, చిత్తూరు.

అనుమానాలు కలుగుతున్నాయి



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో కేటాయించిన సీట్లను హఠాత్తుగా వెనక్కు తీసుకోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి విద్యార్థులకు మేలు చేయాలే తప్ప అన్యాయం చేయకూడదు. నా లాంటి వేలాది మంది పేద, మధ్య తరగతి వి ద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీటు దొరకడమనేది ఎంతో అదృష్టం. నీట్ ప రీక్ష రాసి సీటు వస్తుందని ఆశలు పెట్టుకున్న మాకు అన్యాయం చేయడం సరైన పద్ధతి కాదు.

– మౌనిషా, నీట్ విద్యార్థిని, చిత్తూరు.

విద్యార్థులకు తీరని అన్యాయం



రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీల తో ఎక్కువ సీట్లు వచ్చి ఎక్కువమందికి మెడికల్ సీట్లు దక్కేవి కదా. నా తమ్ముని కుమార్తె ఎస్టీ కేటగిరిలో నీట్‌లో 410 మార్కులు తెచ్చుకుంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలుంటే ఇప్పుడు తప్పకుండా సీటు దక్కేది కదా. రాయలసీమలో పులివెందుల కాలేజీకి కేంద్ర మెడికల్ కౌన్సిల్ అనుమతిలిచ్చినా ఎక్కడ జగన్‌కు మంచి పేరొస్తుందోనని చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటుకు దాతాదత్తం చేసి విద్యార్థులకు తీరని అన్యాయం చేసింది.

ఎస్టీ నాగరాజు, పలమనేరు

ఆశలపై నీళ్లు చల్లారు



డాక్టర్ అవ్వాలని ఎంతో కష్టపడి చదివిన నా అన్న కుమార్తె ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. ప్రభుత్వ కళాశాలను ప్రైవేటు పరం చేయడం వల్ల వైద్య విద్య అందని ద్రాక్షలా మారింది. కక్ష సాధింపుతో గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన కళాశాలలకు అనుమతులు ఇవ్వక పోవడం, ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దారుణం. తద్వారా అధిక ఫీజులు చెల్లించుకోలేక ఆశలు వదులు కోవాల్సి వస్తుంది.

– పురంధర్, ఆళత్తూరు, కార్వేటినగరం

మెడిసిన్ సీటుకోసం ఎదురుచూస్తున్నాం



నా చెల్లెలు ఇటీవల నీట్ రాసి ఎంబీబీఎస్ సీటు కోసం ఎదురు చూస్తోంది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో వివరాలు నమోదు చేసింది. రాష్ట్రంలో ఉన్న అన్ని కళాశాలలకు అనుమతులు ఉంటే మెడిసిన్ సీటు సులభంగా వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం కొన్ని మెడికల్ కళాశాలలకు అనుమతులు నిరాకరించిందని, మరి కొన్ని ప్రైవేటు పరంచేసిందని అంటున్నారు. దీంతో మెడిసిన్ సీటు విషయంలో ఆందోళన మొదలైంది.

– ప్రకాష్, ముడిపల్లి, నగరి మండలం

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

శాంతిపురం: పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. కుప్పం డివిజన్‌లో ప్రత్యేక సర్వే ద్వారా బీపీ, డయాబెటీస్, కిడ్నీ, లివర్ వ్యాధులు ఉన్న వారి వివరాలను 45 రోజుల్లో సేకరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను సచివాలయ స్థాయిలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు పూర్తి చేయాలన్నారు. గత ఆగస్టు నుంచి కుప్పం నియోజకవర్గంలో 14 కంటి వైద్య శిబిరాలు నిర్వహించగా 4,600 మందికి కంటి సమస్యలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారన్నారు. చూపు సక్రమంగా లేని 1,200 మందికి స్పెషలిస్టు వైద్యులతో కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కళ్లద్దాలు వాడాలని వైద్యులు సిఫార్సు చేసిన వారిలో 2,700 మందికి కావాల్సిన ఆప్టికల్స్ ఇప్పటికే వచ్చాయని, మిగతావి త్వరలోనే వస్తాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో 50–60 ఏళ్ల వయసులో మరణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం 320 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కడా ప్రత్యేక అధికారి వికాస్ మర్మత్, వైద్యశాఖ జిల్లా అధికారులు డాక్టర్లు ప్రభావతి, హనుమంతరావు, శ్రీనివాస్, హర్షవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వచ్ఛతా హి సేవ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ర్యాలీలు, మారథాన్ రన్, వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో శ్రమదానం చేయాలని కోరారు. సఫాయి కర్మచారులకు రక్షణ పరికరాలు అందించాలని తెలిపారు. కార్యక్రమం నిర్వహిణలో అలసత్వం ప్రదర్శించకూడదని కలెక్టర్ ఆదేశించారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై నిరసన



నిరసన తెలుపుతున్న మైనారిటీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఆమోదించరాదంటూ ఎస్‌డీపీఐ పార్టీ నగర అధ్యక్షులు ఆసిఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యూసఫ్, నగర కార్యదర్శి తౌఫిక్ డిమాండ్ చేశారు. వారు గురువారం స్థానిక గాంధీవిగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టంపై ప్రసుత్తం చర్చ జరుగుతోందన్నారు. దీనిని ముస్లిం మైనారిటీలు వ్యతిరేకిస్తున్న విషయం గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడానికి ఈ చట్టం తేవాలని చూస్తోందన్నారు. ముస్లిం పెద్దలు దానంగా ఇచ్చిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా మత పెద్దలు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ భూములు ప్రభుత్వానివి కాదన్నారు. ముస్లిం వ్యతిరేక బిల్లులను పార్లమెంటులో ఆమోదించుకోవాలని చూడడం అన్యాయమన్నారు. దేశంలోని ఒక వర్గంపై విషం చిమ్ముతున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని విమర్శించారు. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడం లాంటిదన్నారు. ఎన్‌డీఏలో భాగస్వామ్యంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లుని చట్టం కాకుండా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు అను, నాయకులు కరీం, అబ్దుల్ రెహమాన్, నూరుద్దీన్, ఆసిఫ్, అబ్దుల్ రెహమాన్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, ముస్లిం ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

ఆడాళ్లూ.. మీకు జోహార్లు!

మీసాలు మెలేసే మగాళ్లారా..! ఇది మీ కోసమే. వివాహం, సంతానం తరువాత ప్రతి కుటుంబంలో కుటుంబ నియంత్రణ అనేది సర్వసాధారణం. అయితే ఈ కుటుంబ నియంత్రణకు మగాళ్లు భయపడుతున్నారో? మగాళ్లం మేం కు.ని.శస్త్ర చికిత్స చేసుకోడమేంటి అనుకుంటున్నారో.. కు.ని. చేసుకుంటే ఇబ్బందులు వస్తాయనుకుంటున్నారో తెలియడం లేదు గానీ.. జిల్లాలో మూడేళ్లలో దాదాపు 20 వేల వరకు కు.ని. శస్త్ర చికిత్సలు జరిగితే.. వీటిలో ఆడాళ్ల సంఖ్య 19,946. ఇక కు.ని. చేసుకున్న మగాళ్లు ఇద్దరంటే ఇద్దరే ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

- కుటుంబ నియంత్రణపై మగాళ్ల అనాసక్తి
- మూడేళ్లలో 19 వేలకు పైగా మహిళలకు కు.ని. ఆపరేషన్లు
- కేవలం ఇద్దరు మగాళ్లు మాత్రమే ముందుకు
- అవగాహన లేమా..? పురుషాధిక్యమా..!



కు.ని. శస్త్రచికిత్సలు చేసుకున్న మహిళలు (ఫైల్)

చిత్తూరు అర్బన్: జిల్లా జనాభా దాదాపు 29 లక్షల వరకు ఉంటే.. ఇందులో 5.35 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాల్లో చదువుకున్న వాళ్ల సంఖ్య 70 శాతం వరకు ఉంది. పెళ్లిళ్లయ్యి నెలకు 26 వేల వరకు కాన్పులు నమోదవుతున్నాయి. కాన్పుల తరువాత సంతానోత్పత్తి నియంత్రణ, చిన్న కుటుంబం కోసం కు.ని. శస్త్ర చికిత్సలు చేసుకుంటుంటారు. కానీ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల విషయంలో జిల్లాలో మగాళ్ల కంటే మహిళలు ముందుంటున్నారు. పురుషులకు చేసే వేసెక్టమీ కు.ని శస్త్ర చికిత్స 10 నిముషాల్లో పూర్తవుతుంది. వీర్యం ప్రయాణించే చిన్న వాహికకు గాటు పెట్టి, దాన్ని అక్కడే క్లోజ్ చేస్తారు. ఒకసారి శస్త్ర చికిత్స పూర్తయ్యాక మళ్లీ కావాలనుకుంటే దీన్ని తెరిచే అవకాశాలు కూడా ఉన్నాయి. జనాభా నియంత్రణలో కుటుంబ నియంత్రణ కీలకం. అందులోనూ మగాళ్లకు చేసే వేసెక్టమీ కు.ని. పద్ధతి చాలా చిన్న ప్రక్రియ. దీనిపై చాలా మందిలో ఇదేదో పెద్ద ఆపరేషన్ అనే అపోహలు నాటుకుపోయాయి. పైగా వేసెక్టమీ చేయించుకుంటే పురుషుల్లో లైంగిక చురుకుదనం కోల్పోతారనే భావనకూడా లేకపోలేదు. ఇవన్నీ వట్టి మాటలేనని వైద్యులు రుజువు చేసినా అపోహలు మాత్రం వీడటం లేదు. కొందరిలో నేను మగాణ్ణి.. నేను కు.ని. ఆపరేషన్ చేసుకోవడం ఏంటనే పురుషాధిక్యం కూడా వేసెక్టమీల సంఖ్య పెరగకపోవడానికి ప్రధాన కారణం.

జిల్లాలో కుటుంబ నియంత్రణ గణాంకాలు

సంవత్సరం	కు.ని. చేసుకున్న స్త్రీలు	మగాళ్లు
2022–23	8,035	2
2023–24	8,296	0
2024 (ఆగస్టు వరకు)	3,615	0

ఆమెదే పైచేయి

వేసెక్టమీతో పోలిస్తే మహిళలకు చేసే ట్యూబెక్టమీ శస్త్ర చికిత్స కొద్దిగా సంక్లిష్టంగానే ఉంటుంది. స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఫాలోపియన్ నాళాలు కట్‌చేసి ఓ దారంలాంటి దాంతో ముడివేస్తారు. ఈ సమయంలో మహిళల వెన్నెపూసకు మత్తు ఇంజెక్షన్ ఇవ్వాలి. ఆపరేషన్ పూర్తయ్యాక మహిళలు 20 నుంచి 30 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలి. కొన్ని నెలల పాటు బరువులు ఎత్తకుండా, శస్త్ర చికిత్స జరిగిన పొట్ట భాగంలో ఇన్‌ఫెక్షన్ కాకుండా చూసుకోవాలి. ఇన్ని తెలిసినా జిల్లాలో గడిచిన మూడేళ్లల్లో 20 వేల వరకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగితే 19,946 మంది మహిళలు కు.ని చేయించుకోవడం ఆమె ధైర్యానికి, భర్తపై ప్రేమకు నిదర్శనమవుతోంది.

మగాళ్లు ముందుకు రావాలి



వేసెక్టమీ అనేది పది నిముషాల్లో ముగిసే చిన్నపాటి శస్త్ర చికిత్స. ఒక్కసారి వేసెక్టమీ చేయించుకున్న మగాళ్లు రెండో రోజు నుంచే వారి సాధారణ పనులు చేసుకోవచ్చు. ఎలాంటి ఇబ్బందులు, సైడ్ ఎఫెక్ట్ ఉండవు. దాంపత్య జీవితంలో కూడా ప్రాబ్లెమ్ ఉండదు. ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. కానీ ఎందుకో చాలా మంది వేసెక్టమీ చేయించుకోవడానికి ముందుకు రావడంలేదు. ఇప్పటితరం పురుషులైనా కు.ని కోసం ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

– డా.అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి

అవగాహన కల్పిస్తున్నాం



మహిళలు చేసుకునే కు.ని.తో పోలిస్తే.. పురుషులకు వేసెక్టమీ చాలా సులువు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కూడా మగాళ్లకు ఉండవు. పురుషులు ఎక్కువ మంది ముందుకు వచ్చి కు.ని. చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. కుటుంబ పెద్దగా ఉన్న వ్యక్తి చొరవ తీసుకుని కుటుంబ నియంత్ర శస్త్ర చికిత్సలు మగాళ్లు చేయించుకునేలా చేయడం ద్వారా మాత్రమే మార్పు వస్తుందని భావిస్తున్నాం.

– డా.ప్రభావతి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

వరద బాధితులకు కూరగాయల వితరణ



వరద బాధితులకు కూరగాయలను పంపుతున్న మండీ నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని మార్కెట్ కమిటీ యజమానులు విజయవాడ వరద బాధితుల కోసం 30 టన్నుల కూరగాయలను గురువారం స్థానిక మార్కెట్, వి.కోట మార్కెట్ల నుంచి రెండు ప్రత్యేక వాహనాల్లో పంపారు. మార్కెట్ కమిటీ యజమానుల సంఘం నిర్వాహకులు మండీసుధా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవాలనే ఆలోచనతో మండీ యజమానులంతా కలసి ఈ సాయం చేశామని తెలిపారు.

క్లుప్తంగా

సైనికుడికి జెడ్పీ చైర్మన్ నివాళి



సైనికుడి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: రెండ్రోజుల క్రితం గంగవరం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని కల్లాడుకు చెందిన సైనికుడు చంద్రశేఖర్ రెడ్డి మృతదేహానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి సేవలందించే ఓ సైనికుడిని పోగొట్టుకోవడం చాలా బాధాకరమని తెలిపారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బాలాజీ నాయుడు, రాజారెడ్డి, చెంగారెడ్డి, మనోజ్‌రెడ్డి, అమరనాథరెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ గోవిందురాజులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో యువకుడు ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: నగరంలోని ఓ హోటల్లో యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఆర్.పురానికి చెందిన జగన్నాథ నాయుడు కుమారుడు జి.నాగరాజు (32)కు రెండేళ్ల క్రితం పెళ్లయింది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నాగరాజు, మంగళవారం రాత్రి చిత్తూరుకు వచ్చి కొంగారెడ్డిపల్లెలో ఉన్న లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. కొద్దిసేపు తరువాత ఓ దారంతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని చిత్తూరుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, బుధవారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు జైలులో వసతుల తనిఖీ



జైళ్లశాఖ డీజీపీకి మొక్కను అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: రాష్ట్ర జైళ్లశాఖ డీజీపీ, ప్రధాన హోం శాఖ కార్యదర్శి కుమార విశ్వజిత్ గురువారం చిత్తూరులోని జిల్లా జైలును పరిశీలించారు. ఇక్కడ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, వసతులను తనిఖీ చేశారు. జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకును సైతం పరిశీలించారు. జిల్లా జైలులో మరిన్ని వసతులు, సదుపాయాల కల్పనకు కావాల్సిన అవసరాలను, ప్రతిపాదనలను తెలియచేయాలని జైలు అధికారి వేణుగోపాల్‌రెడ్డిని ఆదేశించారు. జిల్లా జైలుకు వచ్చిన డీజీపీని చిత్తూరు ఎస్పీ మణికంఠ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.

చిలుకపై గణపయ్య చిద్విలాసం

కాణిపాకంలో వరసిద్ధుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తజనసందోహం నడుమ పలు వాహన సేవల్లో పురాణ పురుషుడు చిలుకపై చిద్విలాసంగా ఊరేగారు. వేదమంత్రోచ్ఛారణలు, విశేషపూజలు, అలంకరణల మధ్య దివ్య తేజస్సుతో వెలిగిపోయారు. ఉత్సవంతో మంగళ స్వరూపుడుడు చిలుక, వృషభ వాహనాలపై కటాక్షించారు. గణ నామస్మరణలతో భక్తులు తన్మయత్వంతో మునిగిపోయారు.

- వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కాణిపాకం: వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మూలస్థానంలోని స్వామివారికి విశేష అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తర్వాత చిలుక వాహన ఉభయదారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి మంగళహారతులతో చిలుక వాహనంపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా పసుపు పళ్లెం, కర్పూర హారతులు పట్టారు. సకలంనీవే అంటూ వేడుకున్నారు. మేళతాళాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఊరేగింపు కనువిందుగా సాగింది.



ఉత్సవమూర్తికి పూజ చేస్తున్న అర్చకులు

రాత్రి వృషభ వాహనం

రాత్రి వృషభ వాహనంపై స్వామి వారు అభయమిచ్చారు. అలంకార మండపంలో ఉభయ దేవేరుల సహా వినాయకస్వామి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, పరిమళభరిత, పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి ఉభయదారులు, ఆలయ అధికారులు పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చి వృషభ వాహనంపై కొలువుదీర్చారు. ముందుగా ఈ వాహనసేవ ఉభయదారులు ఊరేగింపుగా వచ్చి పట్టువస్త్రాలు సమర్పించారు. తర్వాత ఉత్సవమూర్తిని వృషభ వాహనంపై పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనప్రాప్తి కల్పించారు. ఈ క్రమంలో భక్తులు స్వామిని భక్తి ప్రపత్తులతో తరిస్తూ, మొకరిల్లారు. విఘ్నాలు తొలగించి, మంచి జరగాలని, మనఃపూర్వకంగా వేడుకుంటూ జన్మసార్థకం చేసుకున్నారు.

పురివిప్పిన నాట్యమయూరాలు

కూచిపూడితో కాళ్లు కదిపారు. శిల్ప సదృశ్యమైన దేశ భంగిమలు, ముఖంలో పలికించే భావాలతో పురివిప్పారు. భరతనాట్యంతో భళా అనిపించారు. హరికథ కాలక్షేపం, భక్తిగీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు మెప్పించాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానంలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెనాలి ప్రఖ్య చిల్డ్రన్ బృందం, అనంతపురం అమృత కూచిపూడి నృత్య కళా నిలయం, చిత్తూరు శ్రీగౌర నాట్య కళాక్షేత్రం, విజయవాడ శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీల భరతనాట్యం, కూచిపూడి నాట్యంతో కళాకారులు మురిపించారు. చిత్తూరుకు చెందిన భార్గవి ధార్మికోపన్యాసం, తిరుపతికి చెందిన గాయత్రి, దిలీప్‌చంద్, సుదర్శన్, హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసయాదవ్ గీతాలాపనలు, శ్రీసత్యసాయిబాబా నాటకోత్సవ సమితి పౌరాణిక నాటిక ప్రదర్శన, కోలాటభజనలతో ఆస్థాన మండప వేదిక దద్దరిల్లింది.

నేడు గజ వాహనంపై స్వామి వారు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుని కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకాస్వామి గజ వాహన సేవలో కనిపిస్తారని ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం యథావిధిగా అభిషేకం ఉంటుందన్నారు. రాత్రికి గజ వాహన సేవలో స్వామి వారు భక్తులను దర్శనమిస్తారన్నారు. ఈ వాహనసేవకు కాణిపాకం వన్నియ నాయకర్ వంశస్తులు ఉభయదారులు వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.



చిలుక వాహనంపై గణ నాయకుడు



రథ కలశ ప్రతిష్ట

కాణిపాకం బ్రహ్మోత్సవాలో భాగంగా స్వామివారి రథానికి గురువారం కలశ ప్రతిష్ట చేశారు. ముందుగా ప్రధాన ఆలయంలో రథ కలశం, గొడుగుకు, బ్రహ్మ విగ్రహానికి సంప్రోక్షణ పూజలు చేశారు. అనంతరం రథానికి ప్రత్యేక పూజలు చేసి కలశాన్ని ప్రతిష్టించారు. శనివారం నిర్వహించనున్న రథోత్సవానికి ముందుగా ప్రతిష్ట పూజలు చేయడం ఆనవాయితీ.



వృషభ వాహన సేవలో అధికారులు, ప్రజాప్రతినిధులు



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

రేషన్ లేకుంటే బతకలేనయ్యా!

పలమనేరు : ''నాయనా.. నా రేషన్ కార్డు తీసేస్తారంట సామీ. బియ్యంకార్డు లేకుంటే నేను బతకలేనయ్యా'' అంటూ ఓ వృద్ధురాలు విలపించింది. మండలంలోని పెంగరగుంట పంచాయతీ ముసలిమడుగుకు చెందిన ఆ వృద్ధురాలి దీనగాథ ఆమె మాటల్లోనే.

''సామీ నాపేరు జయమ్మ నాకు ఎనభై ఐదేళ్లు పైన దాటుంటాది. రెండేళ్లుగా వొళ్లు బాగోలేక ఇంట్లోనే ఉంటున్నా. నడవలేను ఇంటి పక్కన వాళ్లు సాయం చేస్తా ఉండారు. నాకు ఇద్దరు బిడ్డలు, అందులో ఒకడు సచ్చిపోయా, పెద్దోనికి ఒళ్ళుబాగోలేక వాని బాధలో వాడుండాడు. దీంతో నేను ఏకాకిగా ఇంట్లో బతుకుతున్నా. ఇంటివద్దకే వచ్చి గతంలో వలంటీర్లు పింఛను ఇచ్చేవాళ్ళు, ఇప్పుడు చంద్రబాబు గవర్మెంటు వాళ్ళని తీసేసిందట కదా. సచివాలయంవోళ్ళు పింఛను ఇస్తా ఉండారు. ఇప్పటిదాకా రేషన్ బండి వాళ్ళు ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేటోళ్ళు ఇకపై వాళ్ళు కూడా రారని చెప్పారు. డీలర్ దగ్గరికెళ్లి రేషన్ తీసుకోకుంటే నా కార్డును తీసేస్తారని చెప్పారు. నడవలేని నేను డీలర్‌కాడికి ఎలా వెళ్లానయ్యా. అందుకే కళ్లు తిరిగి పడిపోయా. ఏం ప్రభుత్వాలో ఏమో నాయనా మాకెందుకు ఈ రాజకీయాలు. నాకు గనక కార్డు తీసేస్తే నేను బతకలేను సామీ'' అంటూ కన్నీళ్లు పెట్టింది.



బాధితురాలు జయమ్మ

టీడీపీ నేతల దాడి..

వైఎస్సార్‌సీపీ నేతలపై కేసు

సదుం: మండలంలోని పాలమంద ఎస్సీ కాలనీలో బుధవారం జరిగిన టీడీపీ నాయకుల దాడిలో పలువురు వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గాయపడిన సంఘటన తెలిసిందే. ఈ సంఘటనలో టీడీపీ మద్దతుదారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12 మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు మునీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో 12 మందిపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ షేక్ షా వలి చెప్పారు. నిష్పక్షపాతంగా విచారించి తప్పు చేసిన వారిపై చర్యలు చేపడతామని వెల్లడించారు.

జీవో నం-85 రద్దుకు వినతి

కుప్పం రూరల్: ప్రభుత్వ జీవో నెం-85ను రద్దు చేయాలని కుప్పం పరిధిలోని పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు డీఎంహెచ్‌వో ప్రభావతమ్మకు వినతి పత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన డీఎంహెచ్‌వోకు గురువారం వైద్యులు విన్నవించారు. పీహెచ్‌సీ వైద్యుల ప్రతినిధి డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యులకు పీజీ కోర్సుల్లో 30 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 15 శాతానికి కుదిస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం దిగి రాకపోతే 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, హరినాథ్ రెడ్డి, జశ్వంత్, కిషోర్, పూజిత, ఉషారాణి ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆశా కార్యకర్త మృతి



మృతి చెందిన సరోజమ్మ అలియాస్ హేమ

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల సబ్ సెంటర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్త సరోజమ్మ అలియాస్ హేమ(35) అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు, పుదిపట్లకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు లక్ష్మీపతితో హేమకు సుమారు 15 యేళ్ల క్రితం వివాహమైంది. సజావుగా సాగుతున్న ఈ కుటుంబంలో భార్యాభర్తల మధ్య పలు మనస్పర్ధలు తలెత్తినట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి హేమ సమీపంలోని పంచలింగేశ్వరస్వామి ఆలయం వెనుక వైపు గల చింత చెట్టుకు ఉరివేసుకొంది. దీన్ని భర్త గుర్తించి స్థానికుల సహాయంతో కిందకి దింపారు. పోలీసులకు సమాచారం తెలియడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తన బిడ్డ ఆత్మహత్య చేసుకుందా లేదా అనే విషయమై విచారణ చేసి న్యాయం చేయాలని మృతురాలి సోదరి జ్యోతి సీఐ రాంభూపాల్‌కు ఫిర్యాదు చేసింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సీఐ స్పందిస్తూ పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి న్యాయం చేస్తామని బాధిత కుటుంబానికి వివరణ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఆశ కార్యకర్తలు పెద్ద ఎత్తున పుంగనూరుకు తరలివచ్చి, ఆమెకు ఘన నివాళులర్పించారు. హేమ మృతితో పుదిపట్లలో శోక సంద్రంగా నెలకొంది.



సీఐ రాంభూపాల్‌కు ఫిర్యాదు చేస్తున్న మృతురాలి తల్లి, సోదరి

తలపై బీర్ బాటిల్‌తో కొట్టుకుని..

కుప్పంరూరల్: బీర్‌బాటిల్‌తో జనంపై దాడికి యత్నించిన మతిస్థిమితం లేని వ్యక్తి చివరకు అదే బీర్‌బాటిల్‌తో తన తలపై కొట్టుకుని మృతి చెందిన సంఘటన కుప్పం పట్టణం సమీపంలో గురువారం చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, ఉదయం 11 గంటల సమయంలో ఐఆర్‌ఎం డిగ్రీ కళాశాల వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి బీర్‌బాటిల్ పట్టుకుని స్థానికులపై దాడికి యత్నించాడు. దాడిలో స్థానికుడు సుకుమార్‌కు గాయాలయ్యాయి. సంఘటనను గుర్తించిన స్థానికులు అతడిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇంతలో ఆగ్రహించిన ఆ వ్యక్తి బీర్‌బాటిల్‌ను తన తలపై బలంగా కొట్టుకుని స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు అతన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు చెప్పారు.



మృతి చెందిన వ్యక్తి

అంతా మా ఇష్టం

- ప్రభుత్వ సెలవు దినాల్లోనే అక్రమ నిర్మాణం
- ఓ టీడీపీ నేత నిర్వాకం

పలమనేరు: 'గవర్నమెంట్ మాది.. ఇక మా ఇష్టం' అంటూ ఓ టీడీపీ నేత పలమనేరు సమీపంలో రోడ్డు పక్కనున్న ప్రభుత్వ స్థలంలో సెలవు దినాల్లో మాత్రమే అక్రమంగా దుకాణం నిర్మిస్తున్న విషయం తాజాగా వెలుగు చూసింది. ఈ ప్రాంతానికి చెందిన టీడీపీ నేత సుబ్రమణ్యం మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు రోడ్డు పక్కన ఓ దుకాణాన్ని నిర్మిస్తున్నాడు. చాలా తెలివిగా కేవలం ప్రభుత్వ సెలవు దినాల్లో మాత్రం దీన్ని నిర్మిస్తూ ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరిస్తునానరు. దీనిపై తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా అధికారులతో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అక్రమంగా నిర్మిస్తున్న దుకాణ గది

మూడు ఇసుక లారీల పట్టివేత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని బీఎస్‌ఆర్‌పేటలో బుధవారం అర్ధరాత్రి ఆర్డీఓ చిన్నయ్య మూడు ఇసుక లారీలను పట్టుకున్నారు. ఆయన సిబ్బందితో కలిసి బీఎస్‌ఆర్‌పేట చెక్‌పోస్టు వద్ద కాపుకాసి 60 టన్నులు కలిగిన మూడు ఇసుక లారీలను చాకచక్యంగా పట్టుకున్నారు. ఆ లారీలను పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన లారీలు తమిళనాడుకు తరలిస్తున్నారని, పట్టుబడ్డ లారీ డ్రైవర్లు కూడా తమిళనాడుకు చెందిన వారీగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు కాలేదని తెలిసింది. మైనింగ్ శాఖ అధికారులు జరిమానా వేయనున్నట్లు సమాచారం. పట్టుబడిన ఒక లారీ ఇసుక విలువ తమిళనాడులో రూ.1.20 లక్షలు పలుకుతోందని ఇసుక వ్యాపారులు చెబుతున్నారు.

ఘాట్‌లో మృత్యుఘోష

''అయ్యా..నన్ను కాపాడండి. నా వల్ల కావడం లేదు. మీకు దండం పెడతా నన్ను బయటకు లాగండి.. మా నాన్న, మామ, డ్రైవర్ చనిపోయారు.. ఏం జరిగిందో అర్థం కావడం లేదు..'' అంటూ భాకరాపేట ఘాట్‌లో కంటైనర్ లారీ కింద కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రుడి ఆర్తనాదాలతో మూడు గంటల పాటు నరకయాతన అనుభవించారు.



క్రేన్ సాయంతో కంటైనర్‌ను పక్కకు తీస్తున్న పోలీసులు

- కారుపై బోల్తా పడిన కంటైనర్ లారీ
- అక్కడికక్కడే ముగ్గురు మృతి
- రెండున్నర గంటల పాటు క్షతగాత్రుడి ఆర్తనాదాలు
- మృతులంతా కర్ణాటక వాసులే..

చంద్రగిరి: శ్రీవారిని దర్శించుకుని తిరిగి వెళ్తున్న వారిని భాకరాపేట ఘాట్‌లో టమాట లోడుతో వచ్చిన కంటైనర్ లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. చెన్నైకి టమాట లోడు వెళ్తున్న లారీ అదుపు తప్పి వీరి కారును బలంగా ఢీకొనడంతో సుమారు 100 మీటర్ల వరకు జారుకుంటూ వెళ్లింది. అయితే కారులో కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు సమీపంలోని హరిస్థల గ్రామానికి చెందిన ముని వెంకటరెడ్డి(55), మంజునాథ(38), డ్రైవరు రమేష్ మూర్తి(34), అక్కడికక్కడే చనిపోగా, తేజేస్ కుమార్ తీవ్రంగా గాయపడి ఇరుక్కుపోయాడు. అయితే ముని వెంకటరెడ్డి కొడుకు తేజస్‌కుమార్, బామ్మర్ది మంజునాథ ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన వారు. అలాగే మృతి చెందిన వారిలో కారు డ్రైవర్ కర్ణాటకలోని గోలచిన్నెనహళ్లికి చెందిన రమేష్ మూర్తి(34)గా గుర్తించారు. తేజేస్ కుమార్‌కు తీవ్రంగాయాలు కాగా, కంటైనర్ డ్రైవరు అల్లాఉద్దీన్ స్వల్ప గాయాలయ్యాయి.

మూడు గంటల పాటు శ్రమించి..!

రోడ్డు ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి ఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీతో కంటైనర్‌ను తొలగించడానికి వీలు కాకపోవడంతో భారీ క్రేన్‌ను రప్పించి, క్షతగాత్రున్ని బయటకు తీశారు. అయితే మృతదేహాలను వెలికితీయడం కష్టతరంగా మారింది. దీంతో మరో క్రేన్‌ను రప్పించి కంటైనర్‌ను పక్కకు తొలగించి, కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను అతికష్టమ్మీద బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

మిన్నంటిన క్షతగాత్రుడి ఆర్తనాదాలు..

కనుమలో భారీ రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిసి అటు వెళ్లే ప్రయాణికులు స్వచ్ఛందంగా క్షతగాత్రున్ని రక్షించేందుకు శ్రమించారు. కంటైనర్‌లో టమాట లోడు అధికంగా ఉండడంతో ప్రయాణికులు టమాటలను బయటకు విసిరేశారు. క్రేన్ సాయంతో క్షతగాత్రున్ని కాపాడడంతో పాటు మృతదేహాలను బయటకు తీయడంలో ప్రయాణికులు మానవత్వం చాటుకున్నారు.

పోలీసుల తీరుపై మండిపాటు..

ఘాట్‌లో ప్రమాదం జరిగినట్లు తెలుసుకున్న భాకరాపేట పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే ఘటనా స్థలం చంద్రగిరి పోలీసు స్టేషన్ పరిధిలో ఉండడంతో అక్కడ నుంచి వారు వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆపై చంద్రగిరికి పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం..

కంటైనర్, కారు బోల్తా పడడంతో వాటిని తొలగించడానికి చాలా సమయం పట్టింది. అయితే ఘాట్ కావడంతో వేరే దారి లేక వందలాది వాహనాలు స్తంభించిపోయాయి.

ఊరగుట్ట ఆక్రమణపై నివేదిక ఇవ్వండి

- సర్వే నెం-61లో ఎలాంటి పనులు చేపట్టకూడదు
- డిప్యూటీ కలెక్టర్ భవాని

బంగారుపాళెం: మండలంలోని మొగిలి రెవెన్యూ గ్రామ పరిధిలో గల ఊరగుట్ట భూ అక్రమణలపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని చిత్తూరు డిప్యూటీ కలెక్టర్ భవాని అధికారులను ఆదేశించారు. మొగిలి గ్రామంలో సర్వేనంబరు 61లో ఊరగుట్టలో ఆక్రమణలకు గురైన భూములను గురువారం డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. ఊరగుట్టలో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములు, శ్మశాన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తుడు ఏకాంబరం నాయుడు ఆక్రమించుకుని విద్యుత్, బోరు, పైప్ లైన్ వేయడంపై గ్రీవెన్స్ సెల్‌లో బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దాంతో డిప్యూటీ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో ఊరగుట్ట భూములను పరిశీలించారు. ఊరగుట్ట భూమి విస్తీర్ణం, భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను గురించి సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. అడంగల్, పారా అడంగల్‌లో కాలువ పొరంబోకు, ఊరగుట్ట అనే వివరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఎవ్వరికీ పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో లేదన్నారు. భూ ఆక్రమణలపై మూడు రోజుల్లో సమగ్ర నివేదికలు అదజేయాలని సూచించారు. ఊరగుట్టలోని సర్వేనెంబరు 61లో ఎటువంటి పనులు చేయరాదని హెచ్చరించారు. అలా చేపడితే కేసులు నమోదు చేస్తామన్నారు.



బంగారుపాళెం: మొగిలిలో ఆక్రమణలకు గురైన భూములను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ భవాని

ఎస్టీలకు భూహక్కు కల్పించాలి

మండలంలోని మొగిలి ఊరగుట్టలో భూములను యానాదులకు సాగు హక్కు కల్పించాలని సీపీఎం నాయకులు సురేంద్ర, మురళి అన్నారు. తరతరాలుగా యానాదులు సాగు చేసుకుంటున్న భూములను అగ్రకులస్తుడైన ఏకాంబరం నాయుడు ఆగ్రమించుకుని సాగుచేసేందుకు ప్రయత్నించడాన్ని వ్యతిరేకించారు. అక్రమార్కులకు సహకరించిన రెవెన్యూ అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు సైతం ఆక్రమించుకుని దొంగ పాసుపుస్తకాలు పొందుతున్నారని చెప్పారు. గిరిజనులకు న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. న్యాయం జరగని పక్షంలో సీపీఎం ఎస్టీల పక్షాన నిలిచి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.